ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 19.12.2025 సమయం: 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. పౌర సేవకులను నియమించేటప్పుడు పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిజాయితీ , సమగ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని.. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్‌పర్సన్‌ల సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

2. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఒప్పంద , పొరుగు సేవల ఉద్యోగుల వివరాల్లో అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

3. అధికారిగా మాత్రమే కాకుండా ప్రజాసేవకుడిగానూ పనిచేసి హోదాకు న్యాయం చేయాలని అఖిల భారత, కేంద్ర సర్వీసుల అధికారుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

4. రాష్ట్రంలో ఈరోజు , రేపు దాదాపు అన్ని జిల్లాల్లో చలి తీవ్రత పెరుగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

**రాష్ట్రపతి**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ లో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్‌పర్సన్‌ల రెండు రోజుల జాతీయ సమావేశాన్ని కొద్దిసేపటి క్రితం ప్రారంభించారు.

సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి , పౌర సేవకులను నియమించేటప్పుడు పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిజాయితీ , సమగ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. UPSC, రాష్ట్ర PSCలు విశ్వసనీయతకు గరిష్ట ప్రాముఖ్యత ఇస్తూనే.. ఎదురయ్యే సవాళ్లను ముందుగానే ఊహించాలని కోరారు.

**బైట్ - రాష్ట్రపతి**

అంతకుముందు, తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నియామక ప్రక్రియల అన్ని దశల్లో పారదర్శకత , సమయానుకూల నియామకాలపై నొక్కి చెప్పారు. ఈ విషయంలో ప్రతిపాదిత డేటా బేస్ దేశంలో నియామక ప్రక్రియలను బలోపేతం చేయడానికి సహాయపడుతుందని , తెలంగాణ PSC దానిలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.

**బైట్ - గవర్నర్**

చట్టబద్ధంగా బలమైన నియామక వ్యవస్థలను బలోపేతం చేయడానికి హైదరాబాద్‌లోని నల్సార్ విశ్వవిద్యాలయం , రాష్ట్ర PSCల భాగస్వామ్యంతో 100 తీర్పుల మైలురాయి సంకలనం సిద్ధమవుతోందని UPSC చైర్మన్ అజయ్ కుమార్ తెలిపారు. ముందుగా , తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బి. వెంకటేశం మాట్లాడుతూ... రెండు రోజుల సమావేశం రాష్ట్ర PSCలు, UPSCలు ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియలలో ఎదుర్కొంటున్న సవాళ్లు , సమస్యలతో పాటు సంస్కరణలను చర్చించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందని తెలియజేశారు.

**ఎంఎస్ఎల్**

**రేవంత్**

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఒప్పంద , పొరుగు సేవల ఉద్యోగుల వివరాల్లో అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. నిన్న మీడియాతో మాట్లాడిన సందర్భంగా ముఖ్యమంత్రి ఈ అంశంపై ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. వాస్తవానికి ఏజెన్సీలు , విభాగాధిపతులు చూపిస్తున్నంత మంది ఉద్యోగులు పనిచేస్తున్నారా ? లేదా? అనేది తేలాల్సి ఉందన్నారు. వీరి లెక్కలు తేల్చేందుకు ఫోరెన్సిక్ ఆడిట్ జరిపిస్తున్నామన్నారు. రికార్డుల్లో ఉన్న ఉద్యోగులు వాస్తవంగా లేకపోయినా.. తప్పుడు ఆధారాలతో వేతనాలు తీసుకున్నారని తేలినా.. వారిపై రెవెన్యూ రికవరీ యాక్టు కింద చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**జీఎస్**

**కిషన్ రెడ్డి**

ఢిల్లీలోని కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి నివాసంలో నిన్న రాత్రి తెలంగాణ ప్రాంత బీజేపీ ఎంపీలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ , ఎంపీలు ఈటల రాజేందర్ , డీకే అరుణ, ధర్మపురి అరవింద్ , రఘునందన్, కొండా విశ్వేశ్వరరెడ్డి , గోడం నగేశ్ , ఆర్ కృష్ణయ్య పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను , పార్టీ కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా మరింత పకడ్బందీగా ప్రజల్లోకి తీసుకెళ్లడం , తెలంగాణలో పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయడం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ , మునిసిపాలిటీ ఎన్నికలు , ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో.. ప్రత్యేకమైన వ్యూహంతో పనిచేయాలని ఎంపీలు నిర్ణయించారు.

**జీఎస్**

**భట్టి, శ్రీధర్ బాబు**

అధికారిగా మాత్రమే కాకుండా ప్రజాసేవకుడిగానూ గుర్తింపు పొందడం ద్వారా హోదాకు న్యాయం చేసినవారవుతారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. 203 మంది అఖిల భారత , కేంద్ర సర్వీసుల అధికారులు తెలంగాణలో నిర్వహించిన 10 వారాల ప్రత్యేక ఫౌండేషన్ కోర్సును పూర్తిచేసుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐలో శిక్షణ ముగింపు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. నిజాయతీ , మానవత్వం, నాయకత్వ పటిమతో ముందుకు సాగాలన్నారు. ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐటీ , పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పరిపాలన అంటే కేవలం ఫైళ్లు , నిబంధనలు మాత్రమే కాదని , ప్రజలతో మమేకమయ్యే మానవ సంబంధ ప్రక్రియగా గుర్తించాలన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న అధికారులకు ధ్రువీకరణపత్రాలను అందజేశారు.

**పీఎస్**

**దామోదర**

రాష్ట్రంలో వైద్యవిద్యలో పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం సంస్కరణలు తీసుకొస్తోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సచివాలయంలో నిన్న మంత్రి నిర్వహించిన సమీక్షలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల పనితీరు , విద్యార్థులకు అందుతున్న వసతులు , విద్యాబోధన నాణ్యతపై సుదీర్ఘంగా చర్చించారు. వైద్య కళాశాలల పనితీరుపై నియమించిన

మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీలు ప్రతినెలా నివేదికలు ఇవ్వాలని సూచించారు.

**పీఎస్**

**డిపో**

రైల్వే పీరియాడికల్ ఓవర్ హాలింగ్, రెగ్యులర్ ఓవర్ హాలింగ్ మెగా మెయింటెనేన్స్ డిపో ఏర్పాటు కోసం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అనంతారం వద్ద 409 ఎకరాల భూమిని ఉచితంగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారని స్థానిక శాసన సభ్యులు డాక్టర్ మురళీ నాయక్ అన్నారు. మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ....

**బైట్ - మురళీనాయక్**

**పీటీసీ – మహబూబాబాద్**

**ఆర్బీఐ గవర్నర్**

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్ర ప్రశంసించారు. నిన్న ఆయన జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను ఆర్‌బీఐ గవర్నర్‌కు ముఖ్యమంత్రి వివరించారు. విద్యుత్తు రంగంలో సంస్కరణలు , మూడో డిస్కం ఏర్పాటు.. సోలార్ విద్యుత్తు వినియోగం పెంచే దిశగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. `బడ్స్ యాక్ట్' నోటిపై చేయాలని, మరిన్ని సంస్కరణలు , ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రిని ఈ సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ కోరారు.

**జీఎస్**

**హౌసింగ్**

తక్కువ ఆదాయ వర్గాలకు అందుబాటు ధరలో సొంత ఇంటి కలను నెరవేర్చడానికి రాష్ట్ర హౌసింగ్ బోర్డు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్ , వరంగల్, ఖమ్మం నగరాలలో మొత్తం 339 ఫ్లాట్లను విక్రయించడానికి సిద్ధమవుతోంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో 111 , వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో 102 , ఖమ్మంలోని శ్రీరామ్ హిల్స్ వద్ద 126 ఫ్లాట్లను విక్రయించనున్నారు. ఏడాదికి ఆరు లక్షలు, ఆలోపు ఆదాయం ఉన్న వారికే ఈ ఫ్లాట్లను కేటాయించనున్నారు. వచ్చేనెల 3వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ తెలిపారు.

**జీఎస్**

**సిట్**

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ను ఏర్పాటు చేసింది. సిట్‌కు హైదరాబాద్ కమిషనర్ వీసీ సజ్జనార్ నేతృత్వం వహించనున్నారు. ఆయనతోపాటు మరో 9 మంది పోలీస్ అధికారులతో సిట్ ఏర్పాటు చేస్తూ పోలీసు డైరెక్టర్ జనరల్ శివధర్‌రెడ్డి నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. సిట్ లో రామగుండం , సిద్దిపేట పోలీసు కమిషనర్లు అంబర్ కిషోర్ ఝా , విజయ్ కుమార్ , మాదాపూర్, మహేశ్వరం డీసీపీలు రితీరాజ్ , నారాయణ రెడ్డి , గ్రేహౌండ్స్ గ్రూపు కమాండర్ రవీందర్ రెడ్డి , రాజేంద్రనగర్ అదనపు డీసీపీ కేఎస్ రావు, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, డీఎస్పీలు శ్రీధర్, నాగేందర్ రావు ఉన్నారు.

**జీఎస్**

**సుప్రీం**

రంగారెడ్డి జిల్లా, హయత్‌నగర్ మండలంలోని గుర్రంగూడ అటవీ ప్రాంతంలోని సర్వే నం.201/1లో ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ వివాదంలో గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేస్తూ జస్టిస్ పంకజ్ మిత్తల్ , జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం నిన్న తీర్పు వెలువరించింది.

**డెస్క్**

**నివాళి**

విశ్రాంత IIS అధికారి బాకర్ మిర్జా గత రాత్రి గుండెపోటుతో మరణించారు. బాకర్ మీర్జా హఠాన్మరణం పట్ల ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం , ముఖ్యంగా ప్రాంతీయ వార్తా విభాగం అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. బాకర్ మీర్జా 2016 వరకు దాదాపు ఐదేళ్ళు హైదరాబాద్ ప్రాంతీయ వార్తావిభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వహించారు. అంతకు ముందు కేంద్ర సమాచార ప్రసార శాఖకు చెందిన పత్రికా సమాచార కార్యాలయం సహా పలు విభాగాలు , ప్రసారభారతిలో ఢిల్లీ, హైదరాబాద్ గౌహతిలలో సేవలందించారు. సౌమ్యులుగా పేరు పొందిన బాకర్ మీర్జా ఇంగ్లీషు , ఉర్దూ భాషల్లో పలు ప్రచురణలు కూడా వెలువరించారు.

**డెస్క్, ఎంఎస్ఎల్**

**చలి**

రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. కుమురం భీం ఆసిఫాబాద్ , సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో అతితక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో 10 డిగ్రీల లోపు నమోదయ్యాయి. రాష్ట్రంలోనే అత్యల్పంగా ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ లో 5.7 డిగ్రీలు నమోదైంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో 6.4

నమోదైంది. రాష్ట్రంలో ఈరోజు , రేపు దాదాపు అన్ని జిల్లాల్లో చలి తీవ్రత పెరుగుతుందని వాతావరణశాఖ సూచించింది. ఐదు జిల్లాలు మినహా మిగిలిన జిల్లాలకు 'ఆరెంజ్' రంగు హెచ్చరికలు జారీ చేసింది.

**పీఎస్, పీటీసీ – ఆసిఫాబాద్**

**తనిఖీ**

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు మూడు గంటల పాటు అన్ని విభాగాలను పరిశీలించారు. మొత్తం 82 మంది సిబ్బందికి షోకాజు నోటీసులు జారీ చేశారు. ఇందులో 63 మంది సమయపాలన పాటించని వారు , 19 మంది విధులకు హాజరు కాని వారు ఉన్నారు. శానిటేషన్ లోపాలపై సంబంధిత సిబ్బందిని హెచ్చరించారు.

**పీటీసీ – యాదాద్రి**

**రాజీ**

ఒక కేసులో రాజీ పడటం వల్ల ఇరువర్గాలు ఆ కేసులో గెలిచినట్లే అని , ఇదే రాజమార్గమని మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత అన్నారు.. రేపు నిర్వహించే జాతీయ లోకాదళత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**బైట్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత**

**పీటీసీ – మహబూబ్ నగర్**